RNI APTEL/26/A4265

మీ తీర్పు

నిజం మా ధర్మం

ప్రజల పక్షమే మా స్వరం

తెలుగు జాతీయ వార పత్రిక

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ | సంపుటి 01 | సంచిక 20 | సంపాదకుడు : పూలంబేటి రాఘవేంద్రకుమార్ | 09 అక్టోబర్ 2026 - 15 అక్టోబర్ 2026 | పేజీలు : 8 | వెల 5-00

## సన్న బియ్యం ధరలకు రెక్కలు

- రేషన్ బియ్యంతో అక్రమ వ్యాపారానికి తెర.. ?
- కావలిలో యథేచ్ఛగా అక్రమ విక్రయాలు జరుగుతున్నాయన్న
- ఆరోపణలు.. పేదల బియ్యం పక్కదారి పడుతోందా?



# వైస్సార్సీపీ అగ్రనేత కామిరెడ్డి రాజారెడ్డి ఆధ్వర్యంలో

# ఘనంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు

- మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన పెద్దారెడ్లు
- పాల్గొన్న మాజీ వైస్సార్సీపీ అగ్రనేత దువ్వూరు బాలచంద్ర రెడ్డి
- మాజీ వైస్సార్సీపీ అగ్రనేత దువ్వూరు వెంట చిందేపల్లి, పెమ్మారెడ్డి
- పెద్దిరెడ్డి ఇంట పండుగ వాతావరణం





వైస్సార్సీపీ అగ్రనేత, ప్రజల అభిమాన నాయకుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు హైదరాబాద్ లోని వారి నివాసంలో, సూళ్లూరుపేట నియోజకవర్గ వైస్సార్సీపీ అగ్రనేతలు కామిరెడ్డి రాజారెడ్డి, దువ్వూరు బాలచంద్ర రెడ్డి, చిందేపల్లి మధుసూదన్ రెడ్డి, పెమ్మారెడ్డి త్రిలోక్ చంద్ర రెడ్డి లు కలసి, ఆకాశమంత పులబొకే అందజేసి, పెద్దిరెడ్డి ఆనంద పడేంత కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. హైదరాబాద్ లోని పెద్దిరెడ్డి నివాసం మొత్తం సూళ్లూరుపేట నియోజకవర్గ నేతలతో నిండిపోయింది. చాలా కాలం తర్వాత,మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మీద వున్న అభిమానంతో దువ్వూరు బాలచంద్ర రెడ్డి ,మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తో కనిపించడం తో దువ్వూరు బాలచంద్ర రెడ్డి వైస్సార్సీపీ లోకి తిరిగి వస్తారా అనే చర్చలు సూళ్లూరుపేట నియోజకవర్గంలో చర్చలు చుక్కర్లు కొట్టాయి. ఒక్కసారిగా సూళ్లూరుపేట నియోజకవర్గంలో రాజకీయాలు మారిపోయాయి అనే చెప్పాలి. అసలు పెద్దారెడ్లు మనసులో ఏముందో, అసలు పెద్దారెడ్లు అందురు కలసి వైస్సార్సీపీ అగ్రనేత మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. దువ్వూరు తిరిగి వైస్సార్సీపీ రంగప్రవేశం చేస్తాడా లేదా అన్నది సూళ్లూరుపేట నియోజకవర్గ వైస్సార్సీపీ నేతలు మదిని దోచేస్తున్న ప్రశ్న. దువ్వూరు మనసులో ఏముందో మరి...... అయితే మాజీ మంత్రి పెద్దిరెడ్డి జన్మదినం సందర్భంగా సూళ్లూరుపేట నియోజకవర్గ పెద్దారెడ్లు తో కలసి దువ్వూరు బాలచంద్ర రెడ్డి కనిపించడం సూళ్లూరుపేట నియోజకవర్గ వైస్సార్సీపీ లో హాట్ టాపిక్ గాఉంది. వివరాల్లోకి వెళ్తే......

**ఎడిటర్(మీతీర్పు):**

తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ అటవీశాఖ మంత్రి, ప్రజల అభిమాన నాయకుడు, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి తండ్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు, వైస్సార్సీపీ అగ్రనేత కామిరెడ్డి రాజారెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా, అట్టహాసంగా, కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మనసును దోచే విధంగా, పెద్ద బొకే అందజేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు కామిరెడ్డి, దువ్వూరు, చిందేపల్లి, పెమ్మారెడ్డి లు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలకు ఒక రోజు ముందుగానే సూళ్లూరుపేట నియోజకవర్గ పెద్దారెడ్లు హైదరాబాద్ చేరుకుని మాజీ మంత్రి పెద్దిరెడ్డి మీద వున్న అభిమానం తో పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు అన్ని రకాలుగా

2



మీ తీర్పు
నిజం మా ధర్మం
ప్రజల పక్షమే మా స్వరం

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం.. ప్రశాంత జీవనం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నిర్వాహకులు

**కావలి( మీతీర్పు):** ఉరుకుల పరుగుల జీవితంలో మనిషి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా ఒక చక్కని మార్గమని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి పట్టణంలోని స్పందన ఫంక్షన్ హాల్‌లో శనివారం ఇండియన్ యోగా ఫెడరేషన్, కావలి రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 39వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యోగాసన ఛాంపియన్‌షిప్--2026 ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి యోగాసన పోటీల నిర్వహణకు కావలి పట్టణం వేదిక కావడం సంతోషకరమన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమైన యోగా నేడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందడం గర్వకారణమని పేర్కొన్నారు. ఇలాంటి పోటీలు యోగా పట్ల యువతలో ఆసక్తిని పెంచడంతో పాటు, ప్రతిభావంతులైన క్రీడాకారులకు తమ నైపుణ్యాన్ని చాటుకునే అవకాశాన్ని కల్పిస్తాయని అన్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను అందిస్తూ, మనిషిలో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణను పెంపొందించే శక్తి యోగాకు ఉందని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, యోగాసనాలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. యోగా సాధన ద్వారా శరీరాన్ని దృఢంగా ఉంచుకోవడంతో పాటు, మనసును ప్రశాంతంగా ఉంచుకోవచ్చని తెలిపారు. నియోజకవర్గంలోని యువత క్రీడలు, యోగా రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ యోగా ఫెడరేషన్ ప్రతినిధులు, కావలి రోటరీ క్లబ్ సభ్యులు, వివిధ జిల్లాల యోగా శిక్షకులు, క్రీడాకారులు, స్థానిక నాయకులు, యోగా అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి శ్రీకారం.. ప్రజల ఆకాంక్షలకు అడుగులు



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే స్థానిక నాయకులు

**కావలి (మీతీర్పు):** గ్రామాల అభివృద్ధితోనే ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పు సాధ్యమవుతుందని భావిస్తూ దగదర్తి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే డివి, కృష్ణారెడ్డి శ్రీకారం చుట్టారు. శనివారం స్థానిక నాయకులతో కలిసి వివిధ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. దగదర్తి మండలంలోని తడకలూరు గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో గ్రామ ప్రజలు తనపై చూపిన ఆదరణ, నమ్మకాన్ని ఎప్పటికీ మరువలేనని గుర్తుచేశారు. ప్రజలు తనకు అందించిన విజయాన్ని పదవిగా కాకుండా బాధ్యతగా భావిస్తూ పనిచేస్తున్నానని తెలిపారు. దగదర్తి మండలంలో ఇప్పటికే కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామీణ ప్రాంతాల్లో రాకపోకలకు మెరుగైన సౌకర్యాలు కలగడంతో పాటు వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది. రహదారులు కేవలం ప్రయాణానికి మాత్రమే కాకుండా గ్రామాభివృద్ధికి, ప్రజల రోజువారీ జీవనానికి ఎంతో కీలకం. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చినప్పుడే అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికీ చేరుతాయి.

అనంతరం తడకలూరు గ్రామానికి చెందిన పలువురు వైకాపా నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పుకుని ఆ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో దగదర్తి మండల ఇన్‌చార్జి పమిడి రవికుమార్ చౌదరి, మండల అధ్యక్షుడు అల్లం హనుమంతరావు, సీనయ్య, వెంకయ్య, సురేష్, గోపాల్, అశోక్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# "కొదురుపాక గ్రామంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు..

**దుర్గామాతను దర్శించుకున్న బిఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష**

పెద్దపల్లి :
పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కొదురుపాక గ్రామంలో బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడ్డాయి. ఈ వేడుకల్లో బిఆర్ఎస్ పార్టీ నాయకురాలు శ్రీమతి దాసరి ఉష గారు ముఖ్య అతిథిగా పాల్గొని, గ్రామంలోని మహిళలతో కలిసి ఉత్సాహంగా బతుకమ్మ ఆడి సంబరాల్లో పాలుపంచుకున్నారు.

# వైస్సార్సీపీ అగ్రనేత కామిరెడ్డి రాజారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు

**మొదటిపేజీ తరువాయి...**

సిద్ధం చేసి విజయవంతం గా పూర్తి చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు పుణ్యమా అని సూళ్లూరుపేట నియోజకవర్గ వైస్సార్సీపీ లో నూతన ఉత్తేజం వచ్చింది అనే చెప్పాలి. చాలా కాలంగా రాజకీయాలకు దూరంగా వున్న మాజీ శ్రీ చెంగళ్ళమ్మ పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ దువ్వూరు పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలకు సూళ్లూరుపేట నియోజకవర్గ పెద్దారెడ్లు తో కలసి పాల్గొనడం విశేషం. గతంలో సూళ్లూరుపేట నియోజకవర్గ వైస్సార్సీపీకి మాజీ చైర్మన్ దువ్వూరు పెద్దదిక్కుగా వున్నారు. కొన్ని మనస్పర్థలు కారణంగా ఎన్నికల తర్వాత పూర్తిగా రాజకీయాలకు దూరంగా వున్నారు .ఈ నేపథ్యంలో సూళ్లూరుపేట నియోజకవర్గ పెద్దారెడ్లు అందురు కలసి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ని కలవడం వెనుక సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఏదో మార్పు సంకేతం గా ఉందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. అసలు మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్ర రెడ్డి తిరిగి వైస్సార్సీపీ లోకి వస్తారా?దువ్వూరు బాలచంద్ర రెడ్డిని సూళ్లూరుపేట నియోజకవర్గ వైస్సార్సీపీ లోకి తీసుకుని వచ్చే ప్రయత్నాలు ఏమైనా జరుగుతున్నాయా?గతంలో జరిగిన అనుభవాలు దృష్ట్యా దువ్వూరు తిరిగి వైస్సార్సీపీ లోకి వస్తారా?ఇలా ఎన్నో ప్రశ్నలు సూళ్లూరుపేట నియోజకవర్గ రాజకీయాల్లో చర్చలు ప్రారంభం అయ్యాయి. రాజకీయాలకు దూరంగా ఉన్న మాజీ వైస్సార్సీపీ అగ్రనేత, సూళ్లూరుపేట శ్రీ చెంగళ్ళమ్మ పరమేశ్వరి దేవస్థానం మాజీ చైర్మన్,ప్రముఖ పారిశ్రామిక వేత్త, దువ్వూరు బాలచంద్ర రెడ్డి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకల్లో కనిపించడం తో, సూళ్లూరుపేట నియోజకవర్గంలో వున్న వైస్సార్సీపీ నేతలు, కార్యకర్తలు, దువ్వూరు అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైస్సార్సీపీ కార్యకర్తలు ఆనందం ఎక్కువ రోజులు ఉంటుందా?మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మరియు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ల మీద వున్న అభిమానం తో దువ్వూరు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలకు హాజరైన నేపథ్యంలో,ఈ పరిణామానికి పెద్దారెడ్లు అందురు హాజరయ్యారు. చక్రం తిప్పి, వైస్సార్సీపీ ని పతిష్టపరిచే



క్రమంలో దువ్వూరు తిరిగి వైస్సార్సీపీ లోకి వస్తే మాత్రం సూళ్లూరుపేట నియోజకవర్గంలో పరిస్థితులు వైస్సార్సీపీ కి అనుకూలంగా మారడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే దువ్వూరు వైస్సార్సీపీ లోకి వస్తాడా అన్నది రాబోయే రోజుల్లో తెలియాలి మరి. ఆర్థికంగా దువ్వూరు బలవంతుడు అవడం,దువ్వూరుకు ఎక్కడ చెడ్డపేరు లేకుండా ఉండడం, సూళ్లూరుపేట నియోజకవర్గ రాజకీయాలను శాసించే శక్తి వంతమైన నాయకులు కావడంతో,దువ్వూరు వైస్సార్సీపీ లోకి వస్తే మాత్రం పెద్దారెడ్లు కు పెద్దదిక్కు గా వుంటారు అన్నది నగ్న సత్యం. దువ్వూరు తిరిగి వైస్సార్సీపీ లోకి వస్తే కార్యకర్తలకు ఊపిరి వస్తుంది అన్నది అక్షర సత్యం. సూళ్లూరుపేట నియోజకవర్గ రాజకీయాల్లో దువ్వూరు అవినీతి మచ్చలేని నాయకులు. దువ్వూరు వున్నాడు అంటే కొండంత ఊపిరి కార్యకర్తలకు. తిరిగి దువ్వూరు వైస్సార్సీపీ లోకి వస్తే మాత్రం సూళ్లూరుపేట నియోజకవర్గంలో తిరిగి వైస్సార్సీపీ జెండా రెపరెపాల లాడడం కాయం. రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో దువ్వూరు తలుచుకుంటే వార్ వన్ సైడ్. దువ్వూరు దృష్టి పెడితే సూళ్లూరుపేట నియోజకవర్గంలో వున్న రెండు మున్సిపాలిటీలు,6మండల పరిషత్లు,126 పంచాయతీలు వైస్సార్సీపీ ఖాతాలోకి వెళ్లడం కాయం అన్నది రాజకీయ విశ్లేషకులు మాట. దువ్వూరు తక్కువగా మాట్లాడి ఎక్కువ పని చేస్తారు అనే పేరు సూళ్లూరుపేట నియోజకవర్గంలో వుంది. ఏదిఏమైనా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినం సూళ్లూరుపేట నియోజకవర్గ కార్యకర్తలకు నేతలకు పండుగ దినం అన్నది దువ్వూరు తిరిగి వైస్సార్సీపీ లోకి పునః ప్రవేశంతో సూళ్లూరుపేట నియోజకవర్గంలో పండుగ వాతావరణం నెలకొంటుంది. సూళ్లూరుపేట నియోజకవర్గంలో వున్న పెద్దారెడ్లు అందురు ఏకతాటిపైకి వస్తే మాత్రం సూళ్లూరుపేట వైస్సార్సీపీ లో పెనుమార్పులు సంభవించే అవకాశం ఉంది. ఏ క్షణం అయినా అది జరిగిన ఆశ్చర్య పోవాల్సినది లేదు. పెద్దారెడ్లు ఏకమై స్థానిక సంస్థలు ఎన్నికల్లో వైస్సార్సీపీ విజయడంకా మోగించడం కాయం. మరి పెద్దారెడ్లు మనస్సు లో ఏముందో. ఏదిఏమైనా దువ్వూరు బాలచంద్ర రెడ్డి తిరిగి వైస్సార్సీపీ లోకి రావాలి అన్నది వైస్సార్సీపీ కార్యకర్తలు మరియు వైస్సార్సీపీ నేతలు ఆశ మరియు ఆకాంక్ష. మరి దువ్వూరు వస్తారో లేదో మరి. దువ్వూరు బాలచంద్ర రెడ్డి వైస్సార్సీపీ ఎందుకు దూరం అయ్యారు?కారణాలు ఏమిటి అన్నది వచ్చే ప్రత్యేక కథనం మీ మీతీర్పు లో వచ్చే వారం.....

# బడి.. గుడి చెంత మద్యం షాపా..?

**పాఠశాల, ఆలయం సమీపంలో మద్యం దుకాణం వద్దంటూ చెంచులక్ష్మీపురం గ్రామస్థుల వేడుకోలు**

**అక్షరాలు నేర్చుకునే బడి ఒకవైపు.. ఆధ్యాత్మికతను చాటే గుడి మరోవైపు.. వాటి సమీపంలోనే మద్యం దుకాణం ఏర్పాటుకు ప్రయత్నాలా? ఇదే ఇప్పుడు చెంచులక్ష్మీపురం గ్రామస్థులను కలవరపెడుతున్న ప్రశ్న. పిల్లల భవిష్యత్తుకు పునాది వేసే పాఠశాల పరిసరాలు, భక్తుల మనసుకు ప్రశాంతతనిచ్చే ఆలయ వాతావరణం కాపాడాలని గ్రామస్థులు అధికారులను వేడుకుంటున్న తీరు బోగోలు మండలం చెంచులక్ష్మి పురం గ్రామంలో చోటుచేసుకుంది.**



ఆందోళన చేస్తున్న స్థానిక మహిళలు

**కావలి (మీతీర్పు):**
బోగోలు మండల పరిధిలోని చెంచులక్ష్మీపురం గ్రామంలో ఎంపీపీఎస్ మోడల్ స్కూల్, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయాలనే ప్రయత్నాలను నిలిపివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు సంబంధిత ఎక్సైజ్ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి తమ ఆవేదనను తెలియజేశారు.

పాఠశాలకు వెళ్లే చిన్నారులు.. వారిని నమ్మకంతో బడికి పంపే తల్లిదండ్రులు.. పిల్లలకు మంచి విద్యతోపాటు మంచి సంస్కారం అందించాలని తపించే ఉపాధ్యాయులు.. వీరందరికీ పాఠశాల పరిసరాలు సురక్షితంగా ఉండటం ఎంతో అవసరం. అలాంటి ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటైతే విద్యార్థుల రాకపోకలు, పరిసరాల ప్రశాంతతపై ప్రభావం పడుతుందేమోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి భక్తులు నిత్యం వచ్చి ప్రార్థనలు చేస్తుంటారు. ప్రశాంతతకు, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే ఆలయ పరిసరాల్లో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం తమ మనోభావాలను దెబ్బతీస్తుందని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రజల విశ్వాసాలు, స్థానికుల అభ్యంతరాలను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

పాఠశాల, ఆలయం నుంచి ప్రతిపాదిత మద్యం దుకాణానికి ఉన్న దూరాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు, అనుమతుల ప్రమాణాలను కచ్చితంగా తనిఖీ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే దుకాణానికి అనుమతులు మంజూరు చేయవద్దని కోరుతున్నారు.

ఇది కేవలం ఒక మద్యం దుకాణానికి సంబంధించిన వివాదం మాత్రమే కాదు.. తమ పిల్లల భద్రత, గ్రామంలోని ప్రశాంత వాతావరణం, ఆలయ పవిత్రతపై గ్రామస్థులకు ఉన్న ఆందోళనకు సంబంధించిన అంశం. అందువల్ల ప్రజల అభ్యంతరాలను పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించి, చట్ట నిబంధనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

బడి బాగుండాలి.. గుడి పవిత్రంగా ఉండాలి.. గ్రామం ప్రశాంతంగా ఉండాలని గ్రామస్తుల కోరుకుంటున్నారు.

# బతుకమ్మ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

**లైటింగ్, శానిటేషన్, భద్రతకు అత్యంత ప్రాధాన్యత**

**జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఉత్సవాలు**

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**బతుకమ్మ ఉత్సవాలపై అధికారులతో సమీక్ష**

కరీంనగర్ :
జిల్లాలో బతుకమ్మ పండుగ ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. బతుకమ్మ ఉత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాలతోపాటు నగరంలో బతుకమ్మ పండుగకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అన్నారు. మహిళాభివృద్ధి, మెప్మా, డి.ఆర్. డి.ఏ అధికారులు అంగన్వాడి సిబ్బందిని, స్వయం సహాయక సంఘాల సభ్యులను, ప్రజా ప్రతినిధులను, ఉద్యోగులను భాగస్వాములను చేస్తూ ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని ఉన్నారు. మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారులు శానిటేషన్, లైటింగ్ తదితర ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బతుకమ్మలు నిమజ్జనం చేసే ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, అక్కడ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలని అన్నారు.

మీ తీర్పు
నిజం మా ధర్మం
ప్రజల పక్షమే మా స్వరం

# సన్న బియ్యం ధరలకు రెక్కలు

- రేషన్ బియ్యంతో అక్రమ వ్యాపారానికి తెర.. ?
- కావలిలో యథేచ్ఛగా అక్రమ విక్రయాలు జరుగుతున్నాయన్న
- ఆరోపణలు.. పేదల బియ్యం పక్కదారి పడుతోందా?

**పేదవాడి ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం.. కొందరి వ్యాపారానికి పెట్టుబడిగా మారుతోందా? ప్రభుత్వం పేదలకు ఉచితంగా అందిస్తున్న బియ్యం పక్కదారి పట్టి, మిల్లుల్లో పాలిష్ చేయబడి, వివిధ బ్రాండ్ల పేర్లతో బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు కావలిలో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఒకవైపు సన్న బియ్యం ధరలు పెరుగుతుండగా, మరోవైపు రేషన్ బియ్యంతో అక్రమ వ్యాపారం సాగుతున్న తీరుపై. మీ తీర్పు ప్రత్యేక కథనం...**



మిల్లులో పాలిష్ చేస్తున్న తీరు



మార్కెట్లో వివిధ బ్యాగులతో దుకాణాల్లోకి వచ్చిన బియ్యం



లారీలు తరలిపోతున్న రేషన్ బియ్యం

**కావలి( మీతీర్పు ):**
ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన పేదలకు ఉచితంగా బియ్యం అందజేస్తుంది. నిరుపేద కుటుంబాలకు నెలవారీ ఆహార భద్రత కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. అయితే, కొందరు రేషన్ డీలర్లు, మధ్యవర్తులు, మిల్లుల నిర్వాహకుల మధ్య కుమ్మక్కుఉంటోందని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని సేకరించి, వాటిని మిల్లులకు తరలించి, పాలిష్ చేసిన అనంతరం మార్కెట్లో విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వెలువడుతున్నాయి.

కావలి పట్టణంలో 74 రేషన్ దుకాణాలు ఉన్నట్లు సమాచారం. వీటిలో కొన్ని దుకాణాల నుంచి బియ్యం అక్రమంగా సేకరించి, ఆటోలు, మినీ లారీల ద్వారా రైస్ మిల్లులకు తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో రవాణా జరుగుతోందని స్థానికంగా చర్చ సాగుతోంది. ఒక్కో దుకాణం నుంచి నెలకు 4 నుంచి 6 టన్నుల వరకు బియ్యం పక్కదారి పడుతోందన్న వాదనలు వినిపిస్తున్నప్పటికీ, ఈ పరిమాణంపై అధికారిక నిర్ధారణ అవసరం.

### నూకలను వేరు చేసి.. పాలిష్ చేసి.. బ్రాండెడ్ సంచుల్లో!

రేషన్ బియ్యాన్ని మిల్లులకు తరలించిన అనంతరం నాణ్యతను మెరుగుపరిచినట్లు కనిపించేలా పాలిష్ చేసి, నూకలను వేరు చేసి, ఇతర బియ్యంతో కలిపి విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అనంతరం వివిధ బ్రాండ్ల పేర్లతో సంచుల్లో నింపి మార్కెట్లోకి విడుదల చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
రేషన్ బియ్యాన్ని కిలో రూ.25 నుంచి రూ.30 వరకు మిల్లులకు విక్రయిస్తున్నారన్న సమాచారం ప్రచారంలో ఉంది. అదే బియ్యాన్ని ప్రాసెసింగ్ చేసి, ఇతర బియ్యంతో కలిపి, బ్రాండెడ్ సంచుల్లో నింపి కిలో రూ.55 నుంచి రూ.65 వరకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ ధరలు, సరఫరా మార్గాలు, సంబంధిత మిల్లుల పాత్రపై అధికారుల తనిఖీలు, రికార్డుల పరిశీలన ద్వారా వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

### సన్న బియ్యం ధరల పెరుగుదల.. అక్రమార్కులకు అవకాశమా?

మార్కెట్లో సన్న బియ్యానికి డిమాండ్ పెరగడం, సరఫరాలో మార్పులు చోటుచేసుకోవడం వంటి కారణాలతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. గతంలో కిలో రూ.40 నుంచి రూ.50 మధ్య లభించిన కొన్ని రకాల బియ్యం ధరలు ప్రస్తుతం రూ.55 నుంచి రూ.65 వరకు చేరుతున్నాయని వినియోగదారులు చెబుతున్నారు.

### లబ్ధిదారులకే నష్టం.. రెండుసార్లు మూల్యం చెల్లిస్తున్న పేదలు!

ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొందరు లబ్ధిదారులు తమకు అందిన రేషన్ బియ్యాన్ని ఇతర అవసరాల కోసం తక్కువ ధరకు విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అదే బియ్యం ప్రాసెసింగ్ అనంతరం మార్కెట్లోకి చేరితే, అవసరమైనప్పుడు అధిక ధర చెల్లించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు.
అంటే.. పేదలకు ఉచితంగా అందాల్సిన ఆహార భద్రత పథకం ప్రయోజనం మధ్యలోనే దారి మళ్లితే, చివరికి నష్టపోయేది నిరుపేద కుటుంబాలే. ఆకలి తీర్చాల్సిన బియ్యం అక్రమ వ్యాపారానికి ఆదాయ వనరుగా మారితే, ప్రజాపంపిణీ వ్యవస్థ ఉద్దేశమే దెబ్బతింటుంది.

### అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటిస్తున్నప్పటికీ, కావలిలో అక్రమ విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది. రేషన్ దుకాణాల నిల్వలు, పంపిణీ రికార్డులు, మిల్లులకు వచ్చే బియ్యం పరిమాణం, రవాణా వాహనాల వివరాలను సరిపోల్చితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.
సివిల్ సప్లైస్, రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు సమన్వయంతో తనిఖీలు నిర్వహించి, అక్రమ రవాణా జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. అధికారులకు నెలవారీ మామూళ్లు అందుతున్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

### పేదల బియ్యానికి రక్షణ కల్పించాలి!

రేషన్ బియ్యం అక్రమ రవాణా, నిల్వ, రీసైక్లింగ్, విక్రయాలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు వాటిని కేవలం సాధారణ తనిఖీలకే పరిమితం చేయకుండా, సరఫరా గొలుసులో ఎక్కడ బియ్యం పక్కదారి పడుతోందో గుర్తించాలి. అనుమానాస్పద మిల్లుల కొనుగోలు రికార్డులు, స్టాక్ వివరాలు, బియ్యం నాణ్యతను పరిశీలించాలి. అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.
పేదల బియ్యం పేదలకే చేరాలి.. ప్రజాపంపిణీ వ్యవస్థలో పారదర్శకత పెరగాలి.. అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట పడాలి. అప్పుడే ప్రభుత్వ పథకం లక్ష్యం నెరవేరడంతో పాటు సామాన్యులకు ఆహార భద్రతపై నమ్మకం కలుగుతుంది.

# ప్రజలకు భరోసా.. బాధితులకు న్యాయం అందించడమే లక్ష్యం

**కావలి,( మీతీర్పు) :**
ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యం.. బాధితుల కన్నీళ్లు తుడిచి, సామాన్యులకు అండగా నిలవడమే నిజమైన పోలీసుల కర్తవ్యం అని కావలి టూటౌన్ పోలీస్ స్టేషన్ నూతనంగా సర్కిల్ ఇన్స్పెక్టర్గా పోలూరి శ్రీనివాసరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించిన ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి పట్టణ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడం పోలీసుల ప్రధాన బాధ్యత. ముఖ్యంగా అన్యాయానికి గురైన బాధితులకు అండగా నిలవడం, సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే సామాన్యుల పట్ల గౌరవంగా వ్యవహరించడం, వారి ఫిర్యాదులను సానుకూలంగా పరిశీలించి సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.
ఎలాంటి అసాంఘిక శక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సామాన్య ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, బాధితులకు న్యాయం అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది సమన్వయంతో, అంకితభావంతో పనిచేస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. కావలి టూటౌన్ పరిధిలో నేరాల నియంత్రణతో పాటు మహిళలు, వృద్ధులు, పిల్లలు, బలహీన వర్గాల భద్రతకు ప్రాధాన్యత కల్పిస్తూ, ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా నూతన సీఐ తన సేవలను అందిస్తారని పట్టణ ప్రజలు ఆశిస్తున్నారు. ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు.

కావలి టూటౌన్ సీఐగా పోలూరి శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ.



మీ తీర్పు
నిజం మా ధర్మం
ప్రజల పక్షమే మా స్వరం

## సింగరేణి కార్మికులకు లాభాల వాటా ప్రకటన..

**కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట..**

**సింగరేణి లాభాల్లో కార్మికులకు 34 శాతం వాటా..**

**కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,500 బోనస్..**

**15 రోజుల్లో పెండింగ్ ఉద్యోగాల సమస్య పరిష్కారానికి చర్యలు..**



హైదరాబాద్ :
తెలంగాణ ప్రజా భవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారి అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు గారు, సింగరేణి పరివాహక శాసనసభ్యులు, సింగరేణి యాజమాన్యంతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు గారు..

సింగరేణి లాభాల్లో కార్మికులకు 34 శాతం వాటా

సింగరేణి సంస్థ సాధించిన లాభాల్లో కార్మికులకు వాటా ప్రకటించడం ద్వారా వారి శ్రమకు తగిన గుర్తింపు కల్పించే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొత్తం రూ. 1,754 కోట్ల లాభాల నేపథ్యంలో కార్మికులకు 34 శాతం వాటాను ప్రకటించారు. సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు లాభాల్లో వాటా అందించడం వారి కష్టానికి తగిన గౌరవాన్ని అందించడమే కాకుండా, వారి కుటుంబాల ఆర్థిక భద్రతకు కూడా దోహదపడనుంది.

సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సైతం ప్రభుత్వం శుభవార్త అందించింది. కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 5,500 బోనస్ ప్రకటించడం ద్వారా వారి సంక్షేమం పట్ల ప్రభుత్వం తన నిబద్ధతను చాటుకుంది. సంస్థ అభివృద్ధిలో రెగ్యులర్ కార్మికులతో పాటు కాంట్రాక్ట్ కార్మికుల పాత్ర కూడా కీలకమని గుర్తిస్తూ వారికి ప్రయోజనాలు కల్పించే దిశగా నిర్ణయాలు తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఒక్కో ఉద్యోగికి సగటున రూ. 1,53,912 అందనుంది అని దసరా బోనస్ రూ. 1,10,250 చొప్పున ప్రకటించిన సంగతి తెలిసిందే..

కార్మికుల సొంతింటి కల సాకారం చేసే దిశగా ప్రభుత్వం

సింగరేణి కార్మికుల దీర్ఘకాలిక ఆకాంక్ష అయిన సొంతింటి కలను సాకారం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కార్మికులు, వారి కుటుంబాలు మెరుగైన జీవన ప్రమాణాలతో జీవించేందుకు అవసరమైన సంక్షేమ చర్యలకు ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించింది. కార్మికుల ఆర్థిక భద్రతతో పాటు నివాస సదుపాయాల కల్పన కూడా ప్రభుత్వ లక్ష్యాల్లో భాగమని ఈ ప్రకటన స్పష్టం చేస్తోంది.

15 రోజుల్లో పెండింగ్ ఉద్యోగాల సమస్యకు పరిష్కారం

సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న వారసత్వ ఉద్యోగాల సమస్యపై ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారు కీలక ప్రకటన చేశారు. విజిలెన్స్ విచారణలు, పెండింగ్ కేసుల కారణంగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న కార్మికుల పిల్లలకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు.

ఈ సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టి, 15 రోజుల్లో ఉద్యోగాల కల్పనకు సంబంధించిన ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని ప్రకటించడం ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాల్లో ఆశలు నింపింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.విజిలెన్స్ కేసులు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న కార్మికుల పిల్లలకు న్యాయం జరిగేలా సంబంధిత అంశాలను పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని ప్రభుత్వం వెల్లడించింది. ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఊరట కల్పించేందుకు ఈ చర్యలు ఉపయోగపడనున్నాయి.కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత

సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తూ వేలాది కుటుంబాలకు జీవనాధారంగా ఉంది. బొగ్గు ఉత్పత్తి నుంచి విద్యుత్ రంగం వరకు సింగరేణి కార్మికుల శ్రమ ఎంతో కీలకమైనది. అలాంటి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తు, ఉద్యోగాల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం ప్రాధాన్యత సంతరించుకుంది.కార్మికుల ప్రయోజనాలకు సంబంధించిన నిర్ణయాలు, పెండింగ్ ఉద్యోగాల సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు సింగరేణి ప్రాంత ప్రజలకు ఎంతో ప్రాధాన్యమైనవిగా నిలవనున్నాయి. సింగరేణి కార్మికులకు లాభాల వాటా, కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్, సొంతింటి కల సాకారానికి హామీ, పెండింగ్ ఉద్యోగాల సమస్య పరిష్కారానికి చర్యలు వంటి ప్రకటనలు కార్మిక కుటుంబాల్లో సానుకూల ఆశలు కల్పిస్తున్నాయి. కార్మికుల సంక్షేమం, యువతకు ఉపాధి, కుటుంబాలకు భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకునే తదుపరి చర్యలపై సింగరేణి ప్రాంత ప్రజలు ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు.

# భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రుల ఉత్సవాలు

**అమ్మవారి దర్శనానికి ఆలయాలకు పోటెత్తుతున్న భక్తులు.. పుష్పాలంకరణలో జగన్మాత దర్శనం**





పలు రూపాలలో అమ్మవారి అలంకరణలు

**కావలి ( మీతీర్పు):** శక్తి స్వరూపిణి జగన్మాత ఆరాధనతో కావలి పట్టణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పలు ఆలయాల్లో శరన్నవరాత్రుల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అమ్మవారి నామస్మరణలు, మంగళహారతులు, వేదమంత్రోచ్ఛారణలతో ఆలయ ప్రాంగణాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంటున్నాయి.

పట్టణంలోని గ్రామదేవత శ్రీ కలగోళ శాంభవి దేవి ఆలయం, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం, విష్ణాలయం, శ్రీ రుద్రపాద క్షేత్ర శివాలయం, వడ్డీపాలెంలోని కనకదుర్గమ్మ దేవస్థానం, వెంగళరావునగర్‌లోని శ్రీ సుందరేశ్వర స్వామి శివాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఉదయం నుంచే అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తూ భక్తులు తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. సాయంత్రం వేళ వివిధ రకాల సుగంధ పుష్పాలతో జగన్మాతను సుందరంగా అలంకరించి, భిన్న రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు ఆలయాలకు తరలివస్తున్నారు. దీపాల వెలుగులు, పుష్పాలంకరణలు, భక్తుల ప్రార్థనలతో ఆలయాలు పండుగ శోభను సంతరించుకుంటున్నాయి.

శరన్నవరాత్రులు కేవలం పూజలు, ఉత్సవాలకే పరిమితం కావు. చెడుపై మంచి సాధించిన విజయానికి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పర్వదినాలు నిలుస్తాయి. జగన్మాతను ఆరాధిస్తూ భక్తులు తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ప్రార్థిస్తున్నారు.



# గూడు ఉన్నా.. గూడు మీద హక్కేది..?

**ప్రభుత్వాలు మారుతున్నా.. పేదల బతుకులు మారవా..**

కావలి( మీతీర్పు): రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు వారివి.. రోజంతా కష్టపడితేనే కుటుంబానికి నాలుగు మెతుకులు దొరికే పరిస్థితి వారిది. ఏళ్ల తరబడి ప్రభుత్వ స్థలాల్లో చిన్నచిన్న గుడిసెలు, ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్న పేదలకు నేటికీ తమ నివాసాలపై పూర్తి హక్కులు దక్కకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వాలు మారుతున్నా.. పాలకులు మారుతున్నా.. తమ గూడు మీద హక్కు మాత్రం కలగానే మిగిలిపోతోందని పేదలు ఎదురుచూస్తున్నారు. కావలి పట్టణంలోని వెంగళరావునగర్, తుఫాన్‌నగర్, చెరువుకట్ట ప్రాంతం, బుడమగుంట గిరిజన కాలనీ, వైకుంఠపురం తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు రిజిస్ట్రేషన్ పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేసింది. సోమవారం కావలి ఆర్డీవో డి. ఎలీషా బాబుకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేదలు రోజువారీ కూలి పనులు, చేతివృత్తులపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య పేర్కొన్నారు. చాలీచాలని ఆదాయంతో కుటుంబ అవసరాలు తీర్చుకుంటూ, కనీస మౌలిక సదుపాయాలు సరిగా లేకపోయినా అనేక ఇబ్బందుల మధ్య అక్కడే జీవనం సాగిస్తున్నారని తెలిపారు.

పేదలకు నివాసం అనేది కేవలం నాలుగు గోడల సముదాయం కాదు.. వారి పిల్లల భవిష్యత్తుకు భరోసా, కుటుంబానికి భద్రత, జీవితానికి ఆత్మగౌరవం. అలాంటి నివాసాలకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

గతంలో వివిధ ప్రభుత్వాలు హౌసింగ్ పట్టాలు, బీ-ఫారం పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు తదితర పత్రాలు అందించిన వారికి కూడా నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదల సమస్యను ప్రభుత్వం మానవీయ దృక్పథంతో పరిశీలించి, అర్హులైన వారందరికీ న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పేదలకు నివాస హక్కులు కల్పించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని పసుపులేటి పెంచలయ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వై. కృష్ణమోహన్, బి. కృష్ణయ్య, జి. మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.




ఆర్డీఓ కి వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

# జనసేనను క్షేత్రస్థాయిలో బలోపేతం చేద్దాం

- **కావలి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపుదాం**
- **పార్టీ శ్రేణులకు జనసేన నాయకుడు మన్నెమాల సుకుమార్ రెడ్డి పిలుపు**

**కావలి(మీతీర్పు ):** జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, పార్టీ శ్రేణుల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం లక్ష్యంగా కావలి పట్టణంలో జనసేన నాయకులు, కార్యకర్తలు ఆత్మీయ సమావేశం తన నివాసం వద్ద సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నెమాల సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ కావలి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేయడంతో పాటు, నాయకులు, కార్యకర్తల మధ్య ఐక్యతను మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సీనియర్ నాయకుల అనుభవాన్ని, యువ కార్యకర్తల ఉత్సాహాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. పార్టీ నిర్ణయాత్మక కమిటీల్లో ఇరువర్గాలకు తగిన ప్రాధాన్యం కల్పించడం ద్వారా సంస్థాగతంగా మరింత సమర్థవంతమైన కార్యాచరణకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. పార్టీ సభ్యత్వాలను విస్తృతంగా పెంచడంతో పాటు, ప్రజలతో నిరంతరం మమేకమవ్వాలని ఆయన సూచించారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరమైన సందర్భాల్లో ప్రజల తరఫున పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే పార్టీ కార్యకలాపాల్లో కీలక అంశంగా ఉండాలని స్పష్టం చేశారు. జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో పనిచేయాలని కోరారు. పార్టీ నాయకులు, జనసైనికులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలపై స్పందించినప్పుడే ప్రజలతో పార్టీ అనుబంధం మరింత బలపడుతుందని పేర్కొన్నారు.

కావలి నియోజకవర్గంలో పార్టీని మరింత విస్తరించి, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించే దిశగా ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో పవన్ కల్యాణ్ అభిమానులు, జనసైనికులు, వీర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మీ తీర్పు
నిజం మా ధర్మం
ప్రజల పక్షమే మా స్వరం

# బతుకమ్మ సంబరాల నిర్వహణకు బీజేపీ మహిళల సన్నాహాలు

**-మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలి**

**-ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ పిలుపు**



**ఉప్పల్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు బీజేపీ మహిళా నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 15న నిర్వహిం చనున్న బతుకమ్మ సంబరాల నేపథ్యం లో బీజేపీ సీనియర్ నాయకురాళ్లు అంబటి భాగ్యలక్ష్మి, తాళ్ల మంగ గౌడ్ ఆధ్వర్యంలో మహిళలతో ప్రత్యేక సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, మేడ్చల్--మల్కాజిగిరి అర్బన్ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లపు జగన్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. ప్రకృతిని పూజిస్తూ, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలు ఐకమత్యంతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తుందని పేర్కొన్నారు. మన సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు వాటి విశిష్టతను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ నెల 15న నిర్వహించనున్న బతుకమ్మ సంబరాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, సంప్రదా యబద్ధంగా వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అందరూ కలిసికట్టుగా కృషి చేసి సంబరాలను విజయవంతం చేయాలని కోరారు. బతుకమ్మ సంబరాలకు మహిళలను సమాయత్తం చేస్తూ, వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సమావేశంలో భోగాల అరుణ, సువర్ణ షిండే, వీణ, కీర్తి, శీలం సుధా, కొండేరు శ్రావంతి, విజేత, పారిజాతం, నీరజ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా సీనియర్ సిటిజన్స్ కన్వీనర్ గా శ్రీనివాస శర్మ



**ఉప్పల్ :** బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా సీనియర్ సిటిజన్స్ కన్వీనర్ గా ఉప్పల్ కు చెందిన బిజెపి సీనియర్ నాయకుడు శ్రీనివాస శర్మ నియమితులయ్యారు. ఈ మేరకు బిజెపి సీని యర్ సిటిజన్స్ సెల్ రాష్ట్ర కన్వీనర్ సుభాష్ చంద్ర మంగళవారం శ్రీనివాస్ శర్మను నియ మించారు. శ్రీనివాస శర్మ ఉప్పల్ మున్సి పాలిటీ కాలంలో కౌన్సిలర్ గా కూడా పనిచే శారు. బిజెపిలో ఎన్నో ఏళ్లుగా క్రియాశీల కంగా వ్యవహరిస్తున్న శ్రీనివాస శర్మకు జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించడంపై పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించడంపై సుభాష్ చందర్ తో పాటు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. సీనియర్ సిటిజెన్ల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.

# రంజోల్ సమాజ్ అధ్యక్షుడిగా వీరన్న



**జహీరాబాద్ :** రంజోల్ వీరశైవ లింగాయత్ సమాజ్ అధ్యక్షుడిగా బోరంచ వీరన్న, ప్రధాన కార్యదర్శిగా జి. సంగమేశ్వర్, గౌరవ అధ్యక్షుడిగా పట్లోళ్ల రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక రాచన్న స్వామి దేవాలయంలో తాలూకా సమాజ్ అధ్యక్షుడు అగూర్ శివరాజ్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కోశాధికారిగా జి. రమేష్, ఉపాధ్యక్షులుగా పట్లోళ్ల చంద్రకాంత్, చిన్నమఠం సంతోష్ కుమార్ స్వామి, సంయుక్త కార్యదర్శులుగా ఆర్. వీరన్న, పి. శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఎం. మహేష్, పి. సతీష్ కుమార్, ఎం. సందీప్, కే. శివకుమార్, కార్యవర్గ సలహాదారులుగా అగూర్ వైద్యనాథ్, తీగుల శరణప్ప, ఎం. భీమాశంకర్ ఎంపికయ్యారు. మిగిలిన కార్యవర్గ సభ్యులను త్వరలో ఎన్నుకోనున్నట్లు తెలిపారు. సమావేశానికి హాజరైన సభ్యులకు నూతన అధ్యక్షుడు బోరంచ వీరన్న కృతజ్ఞతలు తెలిపారు.

# మానవత్వాన్ని చాటుకున్న శాలపల్లి సర్పంచ్ కూరపాటి అశోక్

**-కుమారుడిని కోల్పోయి దుఃఖంలో ఉన్న వలస కార్మిక దంపతులకు అండగా నిలిచిన వైనం**



**వేలేరు :** కుమారుడిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న వలస కార్మిక దంపతులను పరామర్శించి, వారికి ఆర్థికంగా అండగా నిలిచి శాలపల్లి గ్రామ సర్పంచ్ కూరపాటి అశోక్ మానవత్వాన్ని చాటుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వలస వచ్చి మద్దెల వాగు అయ్యగారి బావి వద్ద బొగ్గు కట్టెలు కాల్చుకుంటూ జీవనం సాగిస్తున్న సుబ్బరాయుడు,నారాయణమ్మ దంపతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఈ కష్టకాలంలో తమ కుమారుడిని కోల్పోవ డంతో వారు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. వారి పరిస్థితిని తెలుసుకున్న సర్పంచ్ కూరపాటి అశోక్ మానవతా దృక్పథంతో స్పందించి, వారి వద్దకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత దంపతులకు ఒక క్వింటాల్ బియ్యం, నిత్యావసర సరుకులు, దంపతులిద్దరికీ దుస్తులు అందజేసి ఓదార్చారు. కష్టకాలంలో వారికి అండగా నిలిచి తన వంతు సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కూరపాటి అశోక్ మాట్లాడుతూ, కుమారుడిని కోల్పోయి దుఃఖంలో ఉన్న దంపతుల పరిస్థితిని చూసి తన మనసు చలించిపోయిందని అన్నారు. వారి బాధను చూసి తట్టుకోలేక తన వంతుగా చిన్నపాటి సహాయం అందించినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ తనకు చేతనైనంత సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎర్రగొల్ల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు పోతారబోయిన సతీష్, వార్డు సభ్యుడు దేవరాజుల వెంకటేష్, గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి మండల కొమురయ్య, అజ్మీరా భద్రు, అజ్మీరా శంకర్, భూక్యా చంద్రు, అజ్మీరా రమేష్, కనుకం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# దేవి నవరాత్రుల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**- అమ్మవారికి.ప్రత్యేక పూజలు..**

**- భక్తులకు అన్నప్రసాద వితరణ**





**ఉప్పల్ :** దేవి నవరాత్రుల సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలోని ఉప్పల్, రామంతాపూర్ డివిజన్లలో అమ్మవారి ఆలయాల వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయు రారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవి నవరాత్రులు భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ఐకమత్యానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో భక్తిభావాన్ని, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి నామస్మరణలు, ప్రత్యేక పూజలతో ఆలయా ల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తిశ్రద్ధల తో నిర్వహించిన పూజా కార్యక్రమాలు, అన్నప్రసాద వితరణలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మోడీ టయోటా షోరూమ్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**-వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు మేకల మధుసూదన్ రెడ్డి,సుధాకర్ రెడ్డి**






**ఉప్పల్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు ఉప్పల్‌లోని మోడీ టయోటా కార్ల షోరూమ్‌లో ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు మేకల మధుసూదన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా షోరూమ్ జనరల్ మేనేజర్ కొండబాబు, ఎగ్జిక్యూటివ్ ప్రదీప్‌తో పాటు సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆటల్లో పాల్గొన్నారు. సంప్రదా యబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటూ పండుగ సంబరాలను ఆస్వాదించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐకమత్యానికి ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నా రు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఇటువంటి పండుగలను అందరూ కలిసి జరుపుకోవడం సంతోషకరమని తెలిపారు. షోరూమ్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపాయి. పండుగ వాతావరణంలో సాగిన ఈ వేడుకలు ఆహ్లాద కరంగా ముగిశాయి.

# సుజాత నగర్ ప్రెస్ క్లబ్ గది ఏర్పాటు కోసం మేయర్ కి వినతి పత్రం అందజేసిన చల్లగుండ్ల నరేష్ కుమార్

**సానుకూలంగా స్పందించిన మేయర్**




**సుజాతనగర్ :** సుజాత నగర్ ప్రెస్ క్లబ్ కోసం గది కేటాయించాలని కోరుతూ మంగళవారం కొత్తగూడెం లో కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ కు సుజాత నగర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చల్లగుండ్ల నరేష్ కుమార్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రావు, ప్రసాద్,కమిటీ సభ్యులు అందజేశారు. మూడ్ గణేష్ మాట్లాడుతూ సానుకూ లంగా స్పందించి, ప్రెస్ ఏర్పాటు కోసం ప్రయత్నం చేస్తా అన్నారు. ఈ కార్యక్రమం లో కార్యదర్శి రహీం, కన్వినర్ ఉబ్బనపల్లి ప్రసాద్, ప్రచార కార్యదర్శి కత్తి బాలకృష్ణ, గౌరవ సలహా దారులు పాల్గొన మరియు కమిటీ సభ్యులు అజ్జు, వెంకటేష్, సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

**ఆర్ అండ్ బీ అధికారులకు 36వ వార్డు కౌన్సిలర్ శ్రవణ్ వినతి**



**జహీరాబాద్:** జహీరాబాద్ నియోజకవర్గంలోని తాండూరు, మొగుడంపల్లి, కోహీర్ రహదారులు గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని 36వ వార్డు కౌన్సిలర్ శ్రవణ్ తెలిపారు. రహదారులపై ఏర్పడిన గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆయా రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ మేరకు ఆర్ అండ్ బీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారుల మరమ్మతులు చేపట్టి, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ శ్రవణ్ విజ్ఞప్తి చేశారు.

మీ తీర్పు
నిజం మా ధర్మం
ప్రజల పక్షమే మా స్వరం

## వీఓఏ భవన నిర్మాణ పనులకు భూమిపూజ



జహీరాబాద్

మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని లచ్చ నాయక్ తండా సర్పంచ్ ప్రేమ్ సింగ్ రాథోడ్ అన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలకు సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా వీఓఏ భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు.మండలంలోని లచ్చ నాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలో వీఓఏ భవన నిర్మాణ పనులకు సర్పంచ్ ప్రేమ్ సింగ్ రాథోడ్ కొబ్బరికాయ కొట్టి భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సంఘటితంగా ముందుకు సాగేందుకు, తమ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించుకునేందుకు వీఓఏ భవనాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మహిళలకు అవసరమైన వసతులు కల్పించడం ద్వారా సంఘాల కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సి. ఐ. ని కలసిన ఎస్.సి.ఎస్. టి. అట్రాసిటీ సభ్యులు.

**డాక్టర్ అరవ పార్వతయ్య. దాసరి వెంకటేశ్వర్లు.**



**మనుబోలు. 13.10.2026 :**

తిరుపతి జిల్లా నాయుడుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ గా ఉద్యోగ బాధ్యతలు తీసుకున్న శ్రీ టి వెంకటరమణ వారిని నాయుడుపేటలో మంగళవారం వారి ఆఫీసులో కలుసుకొని శాలువతో సత్కరించి శుభాభినందనలు తెలిపిరి. ఈ కార్యక్రమంలో జిల్లా అట్రాసిటీ కమిటీ సభ్యులు డా. ఆరవ పార్వతయ్య మరియు దాసరి వెంకటేశ్వర్లు జిల్లా అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యులు పాల్గొన్నారు.

## డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన...

**పట్టణ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పోలూరు వెంకటముని**

**శ్రీకాళహస్తి అక్టోబర్ 13**



శ్రీకాళహస్తి డి.ఎస్.పి కార్యాలయంలో డి.ఎస్.పి పావని ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా పాలూరి వెంకటముని మాట్లా డుతూ...శ్రీకాళహస్తి పట్టణంలో కొంతమంది రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులు రోజురోజుకూ పెట్రేగిపోతున్నారు. ముఖ్యంగా బలహీన వర్గాలకు చెందిన దళిత వాడల్లోకి వెళ్లి అమాయక ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. డబ్బుల కోసం బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీనివల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయింది." అని ఆవేదన వ్యక్తం చేశారు.పట్టణంలో నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై నిఘా పెంచాలని, రౌడీషీట్లు ఉన్న వారిని పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వాలని, పదేపదే నేరాలకు పాల్పడే వారిపై పిడి యాక్ట్, బైండోవర్ కేసులు నమోదు చేయాలని ఆయన డి.ఎస్.పి ని కోరారు. దీనిపై డి.ఎస్ పావని సానుకూలంగా స్పందించారు.శాంతి భద్రతల పరిరక్షణే తమ ప్రధమ కర్తవ్యమని, ఎవరు చట్టాన్ని చేతిలోకి తీసుకున్నా, ప్రజలను ఇబ్బంది పెట్టినా కఠినంగా వ్యవహరిస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలో పోలీసు పెట్రోలింగ్ ముమ్మరం చేస్తామని, రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని తెలిపినట్లు వెంకటముని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# మంజుల మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు....

- **మంజుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి.....**
- **నిబద్ధత గల ప్రజా గొంతుక మూగబోయింది**
- **కుటుంబానికి ప్రగాఢ సానుభూతి**
- **కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్.....**



**కొత్తగూడెం :**

విద్యార్థి, ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న మంజుల అకాల మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మూడ్ గణేష్ అన్నారు. సిపిఐ (ఎమ్మెల్) న్యూ డెమోక్రసీ పట్టణ నాయకురాలు, జర్నలిస్టు మంజుల అనారోగ్యంతో మృతిచెందగా, ప్రజలు, పార్టీ శ్రేణుల సందర్శనార్థం ఆమె భౌతిక కాయాన్ని స్థానిక ఐఎఫ్టీయూ కార్యాలయంలో ఉంచారు. మంగళవారం ఐఎఫ్టీయూ కార్యాలయానికి చేరుకున్న మేయర్ మూడ్ గణేష్ ఆమె భౌతికకాయాన్ని సందర్శించి, పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ.. పీడీఎస్యూలో సుదీర్ఘకాలం పనిచేసి విద్యార్థి సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిన నిబద్ధత గల వ్యక్తి మంజుల అని కొనియాడారు. విద్యార్థి ఉద్యమాల నుంచి జర్నలిస్టుగా, ప్రజా ఉద్యమ నేతగా ప్రజల పక్షాన నిలిచి గళమెత్తారని గుర్తుచేసుకున్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. భర్త, జర్నలిస్టు జంపన్నకు, వారి కుమారుడికి, కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి ప్రజా శ్రేణులు అండగా నిలవాలని ఆయన కోరారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్,



జిల్లా సమితి సభ్యులు నేరెళ్ల రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వర్క అజిత్ తదితరులు వున్నారు.

# మల్లికుదుర్ల అంబేద్కర్ సంఘానికి ముగ్గురు దాతల సహకారం

**-సంఘ భవనం అభివృద్ధికి ముందుకొచ్చిన గ్రామానికి చెందిన దాతలు**



**వేలేరు :**

సామాజిక సేవా దృక్పథంతో మల్లికుదుర్ల గ్రామంలోని అంబేద్కర్ సంఘ భవనం అభివృద్ధికి ముగ్గురు దాతలు తమ వంతు సహకారం అందించేందుకు ముందుకొచ్చారు. వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలో అంబేద్కర్ సంఘం సభ్యుల విజ్ఞప్తి మేరకు గ్రామానికి చెందిన పల్లె రాజిరెడ్డి, గోదల రాజిరెడ్డి, సారంపల్లి మల్లారెడ్డి సంఘ భవనంలో వివిధ అభివృద్ధి పనులకు సహాయం చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు.దాతల్లో పల్లె రాజిరెడ్డి కమ్యూనిటీ హాల్‌లో సీసీ పనులు చేపట్టేందుకు సహకారం అందించగా, గోదల రాజిరెడ్డి హాల్‌కు పూర్తిస్థాయిలో రంగులు వేయించేందుకు ముందుకొచ్చారు. సారంపల్లి మల్లారెడ్డి షెడ్డు నిర్మాణానికి సహాయం అందించను న్నారు. ఈ పనులు పూర్తయితే సంఘ సభ్యులకు మరింత సౌకర్యం కలగనుంది.సంఘ భవనం అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడంపై అంబేద్కర్ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సామాజిక బాధ్యతతో సంఘ అభివృద్ధికి సహకరిస్తున్న పల్లె రాజిరెడ్డి, గోదల రాజిరెడ్డి, సారంపల్లి మల్లారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గ్రామాభివృద్ధికి, సామాజిక సంఘాల బలోపేతానికి దాతల సహకారం ఎంతో దోహదపడుతుందని సంఘ సభ్యులు పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తి



గా నిలవాలని ఆకాంక్షించారు.

# తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా విద్యార్థులు ఎదగాలి

- **చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ పెట్టాలి**
- **మాదక ద్రవ్యాలు జీవితాలను నాశనం చేస్తాయి**
- **టెక్నికల్ కోర్సులతో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి**
- **ఇండస్ట్రియల్ హబ్‌గా మారనున్న పలమనేరు ప్రాంతం**
- **మదర్ థెరిస్సా డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి**



**పలమనేరు, అక్టోబర్ 13 :**

విద్యార్థులు తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలను నెరవేర్చేలా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణతో చదువుపై శ్రద్ధ పెట్టాలని పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డి సూచించారు. యువత చెడు అలవాట్లకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. గంగవరం మండలంలోని మదర్ థెరిస్సా డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... విద్యార్థి దశ జీవితంలో అత్యంత కీలకమైనదని, ఈ సమయంలో కష్టపడి చదువుకుని నైపుణ్యాలను పెంపొందించుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితాలతో పాటు కుటుంబాలను కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుందని, యువత వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని హితవు పలికారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం విద్యార్హతలే కాకుండా సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యాలు కూడా ఎంతో అవసరమని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థులు టెక్నికల్ కోర్సులపై ప్రత్యేక దృష్టి సారించి, తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందని, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల ద్వారా ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను అందించే చర్యలు చేపడుతోందని వివరించారు. పలమనేరు ప్రాంతం భవిష్యత్తులో ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పరిశ్రమల అభివృద్ధితో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, అందుకు అనుగుణంగా విద్యార్థులు ఇప్పటి నుంచే అవసరమైన నైపుణ్యాలను సంపాదించుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమను అలవర్చుకుని తమ లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులు, గురువుల ఆశయాలకు అనుగుణంగా మంచి పౌరులుగా ఎదగాలని ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్య క్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొ



## ఆడపిల్లలు సమాజానికి మణిహారాలు



**నవంబర్ 14న రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డులు కోసం దరఖాస్తుల ఆహ్వానం**

**వలస సుభాష్ చంద్రబోస్ రాష్ట్ర అధ్యక్షులు బాలల హక్కుల ప్రజా వేదిక**

**పెద్దపల్లి :**
ఈరోజు పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ విలేకరులకు ప్రకటన విడుదల చేసి ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా చిన్నారి బాలికలు అంతర్జాతీయ బాలిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు ఆడపిల్లలు సమాజానికి మణిహారాలని పేర్కొన్నారు ఆడపిల్లలు పుట్టనిద్దాం బతకనిద్దాం చదవనిద్దాం ఎదగనిద్దాం అని పిలుపునిచ్చారు బాలల దినోత్సవం నవంబర్ 14 న రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు క్రీడారంగము సాంస్కృతిక రంగము వివిధ రంగాలలో మెరిట్ సర్టిఫికెట్లు వచ్చిన వారికి రాష్ట్రస్థాయిలో బాలమిత్ర అవార్డు కోసం దరఖాస్తు లకు ఆహ్వానం పలుకుతున్నట్టు ఆయన తెలిపారు రాష్ట్ర స్థాయిలో బాలమిత్ర అవార్డులు ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు ఆడపిల్లలు దేశాన్ని గర్వకారణం అని పేర్కొన్నారు బాలికలు రానున్న రోజుల్లో తల్లిదండ్రుల కలలు నిజం చేసేందుకు ఉన్నతమైన వ్యక్తులుగా తయారు కావాలని ఆయన ఆకాంక్షించారు బాల కార్మికుల నిర్మూలన కోసం రాష్ట్రవ్యాప్తంగా బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ గత రెండు దశాబ్దాలుగా బాలల హక్కుల కోసం నిరంతరంగా కృషి చేస్తున్నట్టు ఆయన అన్నారు బాలికను అభినందించారు చిన్నారి బాలికలు సెల్ ఫోన్లకు అలవాటు పడవద్దని పేర్కొన్నారు బాలికలు కృషి పట్టదలతో చదవాలని అన్నారు బాలికల కోసం కేంద్ర ప్రభుత్వం భేటీ బచావో బేటి పడావో అని కార్యక్రమం శ్రీకారం చుట్టిందని ఆయన అన్నారు రాష్ట్ర ప్రభుత్వం బాలికల రక్షణ కోసం షీ టీం కళ్యాణ లక్ష్మి పథకాలు తీసుకువచ్చిందని ఆయన పేర్కొన్నారు బాలికలు క్రీడారంగంలో సాంస్కృతిక రంగంలో ఎదగాలని ఆయన ఆకాంక్షించారు

## చిరుమల్ల రాకేష్.. తప్పుడు వ్యాఖ్యలు మానుకో

**-ఉద్యమం పేరుతో వసూళ్లకు పాల్పడ్డారంటూ ఆరోపణలు -పెద్దపల్లికి వచ్చి మాట్లాడాలని బండారి సునీల్ గౌడ్ సవాల్**

**పెద్దపల్లి :**




బీఆర్ఎస్ నాయకుడు, మాజీ టీఎస్‌టీఎస్ చైర్మన్ చిరుమల్ల రాకేష్ కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూరి వెంకట్‌పై చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఎన్ఎస్‌యూఐ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు బండారి సునీల్ గౌడ్ ఆదివారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాకేష్‌పై విమర్శలు చేశారు. ఈ సందర్భంగా సునీల్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం, ఉస్మానియా విశ్వవిద్యాలయం పేర్లను ఉపయోగించుకుని రాకేష్ వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. గతంలో టీఎస్‌టీఎస్ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో తప్పుడు మార్కుల ప్రచురణ వ్యవహారం విద్యార్థుల మరణాలకు కారణమైందని విమర్శించారు. పెద్దపల్లి ఎంపీ, ఎమ్మెల్సీలు నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషి, నిధుల సాధనపై విమర్శలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. హైదరాబాద్‌లో కూర్చొని విలేకరుల సమావేశాలు నిర్వహిస్తూ విమర్శలు చేయడం మానుకోవాలని, దమ్ముంటే పెద్దపల్లికి వచ్చి గ్రామగ్రామాన పర్యటించి మాట్లాడాలని సునీల్ గౌడ్ సవాల్ విసిరారు. కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కొల అనిల్ యాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడప సతీష్, నాగరాజు, ఎన్ఎస్‌యూఐ నాయకుడు ముక్కెర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఈసీకి ఎంపీ బహిరంగ క్షమాపణ చెప్పాలి



**-బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం డిమాండ్**

**పెద్దపల్లి :**
కేంద్ర ఎన్నికల సంఘంపై, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ చేసిన వ్యాఖ్యలకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం డిమాండ్ చేశారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘాన్ని లక్ష్యంగా చేసుకుని ఎంపీ వంశీకృష్ణ చేస్తున్న వ్యాఖ్యలు ప్రజాస్వామ్య వ్యవస్థను కించపరిచేలా ఉన్నాయని సదానందం విమర్శించారు. దేశంలో ఓట్ల చోరీ జరిగిందంటూ చేస్తున్న ఆరోపణలకు కాంగ్రెస్ నేతలు ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘంపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఎంపీగా బాధ్యతలు చేపట్టి 16 నెలలు గడిచినా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి తీసుకొచ్చిన కేంద్ర నిధులు, చేపట్టిన పనులపై వంశీకృష్ణ స్పష్టత ఇవ్వాలని సదానందం కోరారు. పార్లమెంట్‌లో పెద్దపల్లి సమస్యలపై ఎన్నిసార్లు మాట్లాడారు, సభకు ఆయన హాజరు శాతం ఎంత అనే వివరాలు వెల్లడించాలని సవాల్ విసిరారు. రామగుండం ఎరువుల కర్మాగారం, ఎన్టీపీసీ, సింగరేణి, జాతీయ రహదారులు, రైల్వే అభివృద్ధి వంటి అంశాల్లో కేంద్ర ప్రభుత్వాల పాత్ర ఉందని పేర్కొన్నారు. అయోధ్య రామమందిరం విషయంలో కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను సదానందం తప్పుబట్టారు. అలాగే కాకా వెంకటస్వామి కుటుంబం పేరుతో రాజకీయ లబ్ధి పొందుతున్నారంటూ ఎంపీ వంశీకృష్ణపై విమర్శలు చేశారు. సింగరేణి కార్మికులకు ఇంటి పట్టాలు ఇప్పిస్తామని ఇచ్చిన హామీని ఇప్పటివరకు ఎంతవరకు అమలు చేశారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం రూ.9 లక్షల కోట్ల నిధులు ఇచ్చిందని, పెద్దపల్లి జిల్లాకు రూ.25 వేల కోట్లకు పైగా కేంద్ర నిధులు వచ్చాయని సదానందం తెలిపారు. కేంద్ర నిధులు, అభివృద్ధి పనులపై ఎంపీ వంశీకృష్ణతో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఢిల్లీలో రాజకీయ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం కంటే పెద్దపల్లి ప్రజల సమస్యల పరిష్కారంపై ఎంపీ దృష్టి సారించాలని హితవు పలికారు. ఎన్నికల సంఘంపై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పకపోతే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన సమాధానం చెబుతారని సదానందం వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు మోర మనోహర్, పెండ్యాల కుమార్, సంపత్ చారి, కోలా సుధాకర్, ముస్త్యాల సంతోష్, బండ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ, ఎంపీ అంగోమ్చా బిమోల్ అకోయిజామ్ దిష్టిబొమ్మల దహనం

**మహిళా విద్యార్థులపై వేధింపుల ఆరోపణల నేపథ్యంలోఇన్నర్ మణిపూర్ ఎంపీ అంగోమ్చా బిమోల్ అకోయిజామ్ రాజీనామా చేయాలి: వడ్డేపల్లి భారతి**

**పెద్దపల్లి :**
భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పెద్దపల్లి జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో జీబీఖ మహిళా విద్యార్థులపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మహిళా మోర్చా పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలు వడ్డేపల్లి భారతి ఆధ్వర్యంలో పెద్దపల్లిలోని అయ్యప్ప టెంపుల్ చౌరస్తా వద్ద రాహుల్ గాంధీ, ఇన్నర్ మణిపూర్ ఎంపీ డాక్టర్ అంగోమ్చా బిమోల్ అకోయిజామ్ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి భారతి మాట్లాడుతూ, మహిళా విద్యార్థులతో అనుచితంగా ప్రవర్తించినట్లు ఎంపీ అంగోమ్చా బిమోల్ అకోయిజామ్‌పై వచ్చిన ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో విశ్వవిద్యాలయ అంతర్గత కమిటీ విచారణ, తీసుకున్న చర్యలకు సంబంధించి వచ్చిన నివేదికల నేపథ్యంలో మహిళల గౌరవం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.మహిళల హక్కులు, గౌరవం, భద్రత విషయంలో రాజకీయాలకు అతీతంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ మహిళల ఆత్మగౌరవ పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈ అంశంపై ఆయన స్పష్టమైన వైఖరి ప్రకటించాలని, ఎంపీ అంగోమ్చా బిమోల్ అకోయిజామ్ తో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు.బీజేపీ మహిళ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మాతంగి రేణుక మాట్లాడుతూ, మహిళల భద్రత విషయంలో కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని స్పష్టం చేయాలని అన్నారు. మహిళల పట్ల అసభ్యం గా ప్రవర్తించిన ఎంపీ అంగోమ్చా బిమోల్ అకోయిజామ్ కు ఎంపీ గా కొనసాగే అర్హత లేదని వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బీజేపీ పెద్దపల్లి జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శులు సుల్వ పద్మ,బండారి లత,జిల్లా ఉపాధ్యక్షులు ఎల్తూరి సరిత,జనగామ సుజా శ్రీ జిల్లా అధికార ప్రతినిధి వసంత లక్ష్మీ ,దాసరి సుశీల,ఇరుగురాల శారద,దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మీ తీర్పు
నిజం మా ధర్మం
ప్రజల పక్షమే మా స్వరం

## నేడు కొత్త ఐడీఓసీలో ప్రజావాణి

**కరీంనగర్, మదర్ న్యూస్ ప్రతి నిది :**
జిల్లా ప్రజల సమస్యలు, విజ్ఞప్తుల స్వీకరణ కోసం సోమవారం కరీంనగర్‌లోని నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) భవనంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఐడీఓసీ భవనంలోని సమావేశ మందిరంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

## మీడియా సమావేశంలో పాల్గొన్న టీఎస్ టీఎస్ మాజీ చైర్మన్, డా. చిరుమిల్ల రాకేష్



**పెద్దపల్లి :**
తెలంగాణ రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు జరిగిన పదేళ్లు పూర్తయిన సందర్భంగా టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి ఆదేశాల మేరకు ఈనెల 13న పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో జరగబోయే దశాబ్ది వేడుకలు నిర్వహించడం జరుగుతుందని ఈ మేరకు పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్న టిఎస్ టిఎస్ మాజీ చైర్మన్ , బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. చిరుమిల్ల రాకేష్ కుమార్ గారు, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రఘువీర్ సింగ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ దాసరి మమతారెడ్డి గారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వెన్నం రవీందర్ ,మాజీ జెడ్పిటిసి వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్ , సింగిల్ విండో మాజీ చైర్మన్ జూపల్లి సందీప్ రావు,మండల పార్టీ అధ్యక్షులు ,పట్టణ శాఖ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు బిక్షపతి ,పూదరి శేఖర్ ,పెంచాల శ్రీధర్, వైద శ్రీనివాస్, జావిద్, బాలసాని ఈశ్వర్ గౌడ్,కాశిపాక వాసు, పల్లె మధు, కిషోర్, నూగిళ్ల వీరేశం,,కూరపాటి




రవిచందర్,ఉప్పు శివ, బోయిని మనోజ్,జక్కుల శ్రీకాంత్, కంచి నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

**పెద్దపల్లి :**
ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న ఛలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలోని బరాఖంబ మెట్రో స్టేషన్ వద్ద తెలంగాణ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులతో మరియు కాంగ్రెస్ నాయకులతో కలిసి నిరసన తెలుపుతున్న రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం... గ్రీవెన్స్ డేలో ఫిర్యాదులు స్వీకరించిన సీపీ

**రామగుండం :**



ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి,వారి సమస్యలను చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని రామగుండం పోలీస్ కమిషనర్ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పెద్దపల్లి,మంచిర్యాల జిల్లాల నుంచి వచ్చిన పలువురు ఫిర్యాదుదారుల సమస్యలను పోలీస్ కమిషనర్ స్వయంగా విని, సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ఫిర్యాదులపై సమగ్రంగా విచారణ చేపట్టి,చట్టప్రకారం సత్వర పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని, అవసరమైన విచారణ చేపట్టి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సీపీ అధికారులకు సూచించారు. ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం కలిగే విధంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మీ తీర్పు
నిజం మా ధర్మం
ప్రజల పక్షమే మా స్వరం

# శభాష్ రాజా



- నీ సేవలకు సలాం.. ○ రాజాకి అభినందనలు వెల్లువ..
- ఆపదలో నేను వున్నాను అంటూ పేదలకు సహాయం చేస్తున్న రాజా

**నిరుపేద దళిత కుటుంబం లో పుట్టి, నర్సింగ్ విద్యను పూర్తి చేసి నిరుపేద ప్రజలకు సేవా చేస్తున్నాడు సూళ్లూరుపేట పట్టణానికి చెందిన యువకుడు రాజా. రాజా అంటే రక్షకుడు లాగా నిరుపేద ప్రజలు ఆపదలో వుంటే అత్యవసర సమయంలో నేను వున్నాను అంటూ కాకి తో కబురు పంపితే క్షణంలో వాలిపోతున్నాడు రాజా మెడికల్ కేర్ సర్వీస్ సేవా సంస్థ యువకుడు. రాజా మెడికల్ కేర్ సేవా సంస్థ స్థాపించి, అత్యవసర పరిస్థితుల్లో అండగా వుంటూ ప్రజల ప్రాణాలను కాపాడుతున్నాడు రాజా...... వివరాల్లోకి వెళ్తే.......**

**సూళ్లూరుపేట (మీతీర్పు):**
కాసుల కోసం కక్కుతి పడే ఈ రోజుల్లో, నాకు కాసులు వద్దు ప్రజాసేవే ముద్దు అంటూ ,అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సేవా చేస్తున్నాడు యువకుడు రాజా.నిరుపేద కుటుంబం లో పుట్టి కష్టపడి చదువుకుని, తను చదువుకున్న చదువుకు న్యాయం చేస్తున్నాడు యువకుడు రాజా. వివరాల్లోకి వెళ్తే దళిత సామాజిక వర్గంలో పుట్టి, దళిత బిడ్డ పులి బిడ్డ రా బుజ్జి అనే రీతిలో ప్రజలకు సేవా చేస్తున్నాడు రాజా మెడికల్ కేర్ సేవా సంస్థ వ్యవస్థాపకుడు రాజా. ప్రజలు కష్టాల్లో వున్నారు అని కబురు పంపినా, తన దృష్టికి వచ్చినా రాకెట్ కంటే వేగంగా స్పందిస్తాడు రాజా. తనకు తెలిసిన వైద్య సేవలను అత్యవసరం గా అందించి ప్రజల ప్రాణాలను కాపాడుతూ ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు రాజా. రాజా అంటే మనిషి కాదు రాజా అంటే సేవకుడు అనే రీతిలో సేవలు చేస్తున్నాడు రాజా. ముఖ్యం గా వయస్సు పై పడిన వారిని వారి కుటుంబ సభ్యులు చూడకుండా వుంటే, వారిని స్వయంగా రాజా చూసి ,వారికి సేవలు చేస్తూ, శభాష్ రాజా అనిపించుకుంటూ ముందుకు పోతున్నాడు రాజా. ఈ మధ్య కాలంలో సూళ్లూరుపేట రైల్వే స్టేషన్లలో ట్రైన్ లో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి అపర్మక స్తిలోకి వెళ్తే అటు వైపు వాకింగ్ చేస్తున్న రాజా కి విషయం తెలిసి హుటాహుటిన తనకు తెలిసిన వైద్యం అందించి ఆ ప్రయాణికుడు ప్రాణాలను కాపాడాడు రాజా. నిన్న సూళ్లూరుపేట షార్ బస్టాండ్ రోడ్డు లో ఎదురుగా ఓ వ్యక్తి చలనం లేకుండా పడిపోయి వుంటే, అటు వైపు వెళ్ళే వారు పట్టించుకోకుండా చోద్యం చూస్తూ వుంటే, అటు వైపుగా వెళ్తున్న రాజా చూసి, మానవత్వం తో ఒక అడుగు ముందుకు వేసి, ధైర్యం గా వెళ్ళి సీపీర్ చేసి,108 కి ఫోన్ చేసి హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఆ వ్యక్తి ప్రాణాలను కాపాడాడు రాజా. ఇలా రాజా గురించి చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి. రాజా చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించి,రాజా కు గుర్తింపు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. శభాష్ రాజా......రాజా నీకు సూళ్లూరుపేట పట్టణ యువత నుంచి నీకు సెల్యూట్....

# ఎల్‌నినో సవాళ్లను అధిగమించేలా ఆయిల్‌పామ్ తోటల యాజమాన్యం చేపట్టాలి

**ముత్తారం గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం**

**ఎల్‌నినో పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ సాగులో నీటి, పోషక యాజమాన్యం అత్యంత కీలకం**

**జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి గడ్డం శ్యాంప్రసాద్**



**పెద్దపల్లి :**
పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ముత్తారం గ్రామంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి శ్రీ గడ్డం శ్యాంప్రసాద్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆయిల్‌పామ్ సాగు ప్రాధాన్యతను వివరించారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్ తోటల్లో సమర్థవంతమైన నీటి యాజమాన్యం, సమతుల్య పోషకాల వినియోగం ద్వారా పుష్పాల అభివృద్ధి, గెలల ఏర్పాటు, అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

అలాగే ఆయిల్‌పామ్ సాగులో రైతులకు అవసరమైన స్లాషర్లు, ష్రెడర్లు, మినీ ట్రాక్టర్లు వంటి వ్యవసాయ యంత్ర పరికరాలతో పాటు బిందు సేద్య పరికరాలపై ఉద్యానవన శాఖ ద్వారా రాయితీలు అందిస్తున్నట్లు వివరించారు.

ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కోకో సాగు చేపట్టడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని, కోకో సాగుకు కూడా ఉద్యానవన శాఖ ద్వారా రాయితీ సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అనంతరం కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ డీజీఎం మరియు జోనల్ మేనేజర్ శ్రీ ఎన్. హరి మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ తోటల్లో తమ సంస్థ ఉత్పత్తుల వినియోగం, వాటి ప్రయోజనాలను రైతులకు వివరించారు.

సంస్థ సీనియర్ అగ్రానమిస్ట్ శ్రీ వినోద్ ఆయిల్‌పామ్ సాగులో ఎరువుల యాజమాన్యం, సమతుల్య పోషకాల వినియోగం, మొక్కల ఆరోగ్యకరమైన పెరుగుదల, అధిక దిగుబడుల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు సాంకేతిక అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో కోరమాండల్ సంస్థ బిజినెస్ మేనేజర్ శ్రీ వివేక్, పెద్దపల్లి మార్కెటింగ్ మేనేజర్ శ్రీ రాహుల్ కుమార్, రామగుండం ఉద్యానవన అధికారి శ్రీమతి జ్యోతి, ఉద్యానవన విస్తరణ అధికారి శ్రీ రాజశేఖర్, ఆయిల్‌పామ్ క్షేత్రస్థాయి సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

# మన జిల్లా - మన రామగిరి ఖిల్లా ట్రెక్కింగ్‌లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**అక్టోబర్ 18న ఉదయం 6 గంటలకు బేగంపేట గ్రామం నుంచి ట్రెక్కింగ్ ప్రారంభం**

**ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ చారిత్రక వారసత్వాన్ని తెలుసుకునే అవకాశం**

**మన జిల్లా -- మన రామగిరి ఖిల్లా కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**

**పెద్దపల్లి :**
జిల్లాలోని చారిత్రక వారసత్వ సంపద రామగిరి ఖిల్లా ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడంతో పాటు, ప్రకృతి అందాలను ఆస్వాదించడం, అటవీ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న 'మన జిల్లా -- మన రామగిరి ఖిల్లా' వాకింగ్, ట్రెక్కింగ్ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు.

మంగళవారం పెద్దపల్లిలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష 'మన జిల్లా -- మన రామగిరి ఖిల్లా' వాకింగ్, ట్రెక్కింగ్ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, అక్టోబర్ 18వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటలకు బేగంపేట గ్రామం నుంచి ట్రెక్కింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు రామగిరి ఖిల్లాను సందర్శించి, అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదించడంతో పాటు చారిత్రక వారసత్వ విశేషాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

### ట్రెక్కింగ్‌లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే ఆసక్తిగల వారు పోస్టర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ చారిత్రక ప్రదేశాల ప్రాధాన్యతను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు.

### అటవీ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

ట్రెక్కింగ్ సమయంలో అటవీ ప్రాంతంలోని చెట్లు, మొక్కలు, ఇతర వృక్షసంపదకు ఎలాంటి నష్టం కలిగించకుండా ప్రకృతిని పరిరక్షించాలని నిర్వాహకులు కోరారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ బాధ్యతతో వ్యవహరిస్తూ అటవీ సంపదను కాపాడేందుకు సహకరించాలని సూచించారు.

### చారిత్రక వారసత్వాన్ని కాపాడుకోవాలి

రామగిరి ఖిల్లా వంటి చారిత్రక ప్రదేశాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడంతో పాటు, వాటి పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రకృతిని ఆస్వాదిస్తూ చారిత్రక వారసత్వాన్ని కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఏజే పెడల్స్ సైకిల్స్‌కు చెందిన అఖిల్ రెడ్డి, లెంకల మహిపాల్ రెడ్డి (మాజీ సైనికుడు, అంతర్జాతీయ పర్వతారోహకుడు), పెద్దపల్లి యువశక్తి సోషల్ మీడియా ప్రతినిధి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

Owned By : PULAMBETI RAGHAVENDRA KUMAR, SULLURPETA-524121, TIRUPATIDistrict,, A.P, Editor At : PULAMBETI RAGHAVENDRA KUMAR, SULLURPETA-524121,TIRUPATIDistrict,, A.P,
Published: PULAMBETI RAGHAVENDRA KUMAR, SULLURPETA-524121,TIRUPATIDistrict, A.P, Mobil No: 8309210219, Printed By :PHANITHA RAMGRAPHICS & PRINTERS, KAVALI-524201, Nellore District, A.P, Mobile: 9441960993